క్లుప్తంగా

స్టూడెంట్ కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోట్, పాఠ్యాపుస్తకాలు తదితర సామగ్రితో కూడిన స్టూడెట్‌కిట్లను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువుపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎ.త్రినాథరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సాహితీ వేదిక సంయుక్త కార్యదర్శిగా శరత్‌బాబు



జంధ్యాల శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్ : జాతీయ సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక నూతన కార్యవర్గానికి సంయుక్త కార్యదర్శిగా శ్రీకాకుళంకు చెందిన కవి జంధ్యాల శరత్‌బాబు ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ అధినేత పోలోజు రాజ్‌కుమార్ నుంచి ప్రకటన విడుదలైందని శరత్‌బాబు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరి



అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలాత్రిపుర కాలభైరవ స్వామి పీఠం ఆలయంలో శుక్రవారం గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న బాలభాస్కరశర్మ

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇక్కడ ఉన్న శ్రీచక్రాలవద్ద భక్తులు కుంకుమ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నెడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



అలపాన త్రినాథరెడ్డి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నెడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి అలపాన త్రినాథరెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకంతో ఇన్నాళ్లు పదవి అప్పగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావులకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. జీవితకాలం జగన్ వెంటే ఉంటానని స్పష్టం చేశారు.

విజయదుర్గకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలువీధిలో విజయదుర్గ ఆలయంలో జ్యేష్టమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో కుంకుమపూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.



శ్రీకాకుళం అర్బన్: లయన్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న దాతలు



శ్రీకాకుళం కల్చరల్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



శ్రీకాకుళం అర్బన్: రక్తదాతలను సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

రక్తదానం ప్రాణదానమే



శ్రీకాకుళం కల్చరల్:రక్తదాతలకు జ్ఞాపికలు అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం కల్చరల్: లయన్స్ క్లబ్ హర్షవల్లి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



శ్రీకాకుళం: రిమ్స్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినుల ర్యాలీ

- యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి
- జాతీయ రక్తదాతల దినోత్సవంలో వక్తల పిలుపు

శ్రీకాకుళం కల్చరల్: రక్తదానం చేసేందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపు నిచ్చారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం వద్ద ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా జెండా ఊపి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. అనంతరం 45మంది యువత రక్తదానం చేశారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన ఎం.రోజశ్రీ, ఎం.సుధారాణి, బి.భాగ్యలక్ష్మిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ఎంసీ సభ్యులు నిక్కు అప్పన్న, నూక సన్యాసిరావు, అంధవరపు కల్యాణ్ చక్రవర్తి, చిన్మయరావు, పి.రజనీకాంతరావు, ఎయిడ్స్ విభాగం డీపీఓ ఉమామహేశ్వరరావు, సీఈఓ సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, పెంకి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి జోనల్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి పిలుపునిచ్చారు. నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు వద్ద ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రక్తదానం చేశారు. అనంతరం కిల్లంశెట్టి లక్ష్మీకాంత్, ఎస్.లక్ష్మణ్, గుడ్ల గౌతంలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథంనాయుడు, క్లబ్ జిల్లా చైర్మన్ కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్, కార్యదర్శి మణిశర్మ, ట్రెజరర్ అప్పలనాయుడు, డాక్టర్ కరణం హారిక, లయన్స్ క్లబ్ సభ్యులు, వినియోగదారుల సంఘం జిల్లా కార్యదర్శి నిహార్, లక్ష్మీకాంత్, లక్ష్మీపతి, సుమన్, కృష్ణ, రఫీ, రమాదేవి, గొండు మణి, డాక్టర్ సత్య స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: రక్తదానం చేస్తున్న పోస్టల్ సిబ్బంది

- శ్రీకాకుళం అర్బన్: నేటి యువతే, రేపటి భవిత అని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ అన్నారు. నగరంలోని లయన్స్ బ్లడ్ బ్యాంకు వద్ద శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదాతలు, లయన్స్ క్లబ్ సెంట్రల్ సభ్యురాలు జోగి భారతి, జోగి రాజు, బమ్మిడి రాజారావు, బమ్మిడి లోకేష్, ధర్మాన రాజేష్ , ధర్మాన వంశిలను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ పైడి సింధూర, లయన్ బి.దేవభూషన్, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజ రౌత్, లయన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, టెక్నీషియన్ కె.దుర్గ, వై.వందన తదితరులు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ అధికారులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిరం సావనీర్‌ను పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు శాసన సభ్యుడు గొండు శంకర్‌కు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు అందచేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్యామ్‌సుందర్‌రావు, రిటైర్డ్ అడిషనల్ జాయింట్ కలెక్టర్ రజనీకాంతరావు, ఆర్ట్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం: రక్తదానం ప్రాణదానం ఒకటేనని రిమ్స్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.మీచల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.పద్మావతి అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రిమ్స్ కళాశాల విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.ఉషాపన్నగవేణి, ఏపీవో పి.సునీత, బీఎస్సీ నర్సింగ్ వలంటీర్లు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాతలను సత్కరించారు. వాకర్స్ క్లబ్ సభ్యులుగా ఉంటూ అనేక సార్లు రక్తాన్ని దానం చేసిన పాలకొండ ప్రశాంత్, బి.దేవీ ప్రసాద్, దువ్వ కృష్ణారావులను సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పీజీ గుప్తా, ఎస్.జోగినాయుడు, గేదెల లక్ష్మీ, బీసీ పట్నాయక్, వాసంతి, రాంబాయి, ఎస్.కృష్ణమూర్తి, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



మంటలను అదుపుచేయడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్: అగ్నిప్రమాదాలపై అవగాహన ఉంటే సులువుగా అరికట్టవచ్చని శ్రీకాకుళం అగ్నిమాపక సహాయ అధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు, ఉద్యోగులు, సిబ్బందికి శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినపుడు ఆస్పత్రిలో అమర్చిన పరికరాల ద్వారా ఎలా అరికట్టవచ్చో ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ పార్వతి, ఆర్ఎంఓ సుభాషిణి, భానుప్రకాష్, అగ్నిమాపక సిబ్బంది బి.ఎస్.నాయుడు, రామస్వామి, కోటేశ్వరరావు, కూర్మారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏడీఎఫ్‌వో వరప్రసాద్

విమాన ప్రయాణికులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: విమాన ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు లభించేలా కృషి చేస్తున్నట్లు జిల్లా విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నటుకుల మోహన్, సురంగి మోహనరావు చెప్పారు. శుక్రవారం జిల్లా విమాన ప్రయాణికుల సంఘ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు పౌర విమానయాన శాఖ మంత్రిగా ఎంపిక చేయటం పట్ల ప్రధాని మోదీని అభినందిస్తూ తీర్మానం చేశారు. కేంద్ర మంత్రి హోదాలో మొదటి సారిగా జిల్లాకు వస్తున్న రామ్మోహన్ నాయుడుకు సంఘం తరపున స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు కేంద్ర బిందువైన విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశంలో ప్రధాన నగరాలకు, చారిత్రక ఆలయాలకు విమాన సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, సంఘం ప్రతినిధులు పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి మణి

ఆమదాలవలస: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాలిడ్ వేస్ట్ మెటీరియల్‌పై అవగాహన, న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, కింతలి త్రినాథరావు, పి.వి.నరసింహులు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

తొగరాం డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

ఆమదాలవలస: తొగరాం గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం .సత్యనారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ గ్రూపులో మ్యాథ్స్, బోటనీ, జువాలజీ, బీఏలో పొలిటికల్ సైన్స్, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్ మేజర్ సబ్జెక్టులుగాను, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్, ఫిజిక్స్ మైనర్ సబ్జెక్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపక సిబ్బంది ఉన్నారన్నారు.

ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాల పని వేళల్లో నేరుగా గాని లేదా 94405 26302, 83099 77349, 93984 19249 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రంథాలయాధికారులు



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రంథాలయాధికారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, ఉప గ్రంథాలయాధికారి వి.వి.జి.ఎస్.శంకరరావు శుక్రవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రంథాలయంలో మౌలిక వసతులు, పుస్తకాలు తదితర అంశాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

15న శ్రీశ్రీ వర్ధంతి సభ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ గీతాల ఆలాపన, స్వీయకవితా పఠనం, ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. కవులు, రచయితలు, అభ్యుదయ వాదులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈదురు గాలులతో వర్షం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో ఈదురు గాలులతో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. పలు చోట్ల విద్యుత్ లైన్లపై చెట్టు కొమ్మలు విరిగి పడడంతో సరఫరా నిలిచిపోయింది. గ్రామాలు చీకటి మయంగా మారాయి. జాతీయ రహదారిపై విద్యుల్ దీపాలు వెలగక వాహన చోదకులు చీకట్లో ప్రయాణాలు సాగించారు. పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో గాలులు, వర్షాలు పడటంతో పిల్లలు ఇబ్బంది పడ్డారు.

పేకాట శిబిరంపై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని పీఎన్ కాలనీ ఆరో లైన్‌లో ఓ నివాసంలో జరుగుతున్న పేకాట శిబిరంపై సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలోని రెండో పట్టణ పోలీసుల శుక్రవారం దాడులు నిర్వహించారు. పది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.36,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదే గృహంలో పేకాటతో పాటు క్రికెట్ బెట్టింగ్‌లు సైతం బుకీల ద్వారా జరిపారని స్థానికులు పోలీసులకు తెలియజేశారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు



ఎంపీ అప్పలనాయుడుకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మండల అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావులను వారి క్యాంపు కార్యాలయాల్లో ఎచ్చెర్ల మండల అధికారులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీడీవో రమాదేవితో కూడిన బృందం వారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఎచ్చెర్లను అభివృద్ధి పథంలో నడిపిస్తా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. పెండింగ్‌లో ఉన్న తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం కాలువల పనులు పూర్తి చేయిస్తానని చెప్పారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఐదు సంక్షేమ పథకాల అమలు ఫైళ్లపై సంతకాలు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, పింఛన్ పెంపు, అన్నా క్యాంటీన్లు, స్కిల్ యువజన సర్వేపై ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో కుటమి నాయకులు ముప్పిడి సురేష్, చౌదరి బాబ్జీ తదితరులు ఉన్నారు.

ప్రైవేటు టీచర్లకు న్యాయం చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: సీఎం చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేయడం అభినందనీయమని ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేడ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల తరఫున నూతన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యను మరింతగా పెంచాలని, టెట్ పరీక్ష నిర్వహించాలని కోరారు.

వివిధ ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం, గెస్ట్ ఫ్యాకల్టీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమానపనికి సమాన వేతనం దక్కేలా చొరవ తీసుకోవాలని కోరారు.

● చేప దొరికింది..



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ సరైన వర్షాల్లేవు. వ్యవసాయ పనులు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. దీనికి తోడు ఎండలు మండుతుండడంతో చెరువులు అడుగంటుతున్నాయి. దీంతో చేపల వేట కోసం జనం ఆసక్తి చూపుతున్నారు. లావేరు మండలంలోని ఆరంగిపేట–మురపాక మధ్య కొద్దిపాటి నీటితో ఉన్న చెరువులోకి స్థానికులు శుక్రవారం మధ్యాహ్నం చేపల కోసం పోటాపోటీగా దిగారు. వలలు, ఇతర సామగ్రితో చేపలను పట్టి సందడి చేశారు. –ఎచ్చెర్ల

శ్రీముఖలింగేశ్వరుని కల్యాణ పీఠం అలంకరణ



కల్యాణ పీఠాన్ని సిద్ధం చేస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలలో భాగంగా సోమవారం జరగనున్న పార్వతి పరమేశ్వరుల కల్యాణం కోసం అర్చకులు పీఠాన్ని సిద్ధం చేస్తున్నారు. అమ్మవారు, స్వామివారి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏటా నూతన పీటతోపాటు వాటికి ప్రత్యేక అలంకరణ, రంగులు దిద్ది సిద్ధం చేస్తున్నారు.